# ప్రేమ : పెండ్లి

కథానిక

పి. ప్రేమచంద్ర

(క్రిందటిసంచిక తరువాయి)

"కాలేజీలు మూసేశారు. ఎవరిదారిన వాళ్ళం ఇండ్లకు చేరుకున్నాం కృష్ణమూర్తి ఉత్తరాలు వ్రాస్తుండేవాడు ఒకసారి తను రాబోతున్నాననీ, వెంట దూరపుబంధువు నొకర్ని వెంటబెట్టు కొస్తున్నాననీ వ్రాశాడు కృష్ణను మళ్ళీ చూడొచ్చునన్న సంతోషమే తప్ప, ఆ విషయం తలంచుకున్నప్పుడల్లా గుండె గుబేలు మనేది. ఎందుకంటే, నాన్నా అమ్మా ఈ సంబంధం ససేమిరా ఒప్పుకోరు ఒక్కగానొక్క ఆడపిల్లని. ఏ డాక్టరుకో, ఏ ఇంజనీరుకో వాళ్ళు కోరిన కట్నాలుపోసి చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. అంతేకాని, దమ్మిడీ రికానా లేనివాడు 'నాకు కట్నంవద్దు మీ అమ్మాయిని యివ్వండి' అంటేమాత్రం ఇస్తారా? అందుకని నేను దీని పర్యవసాన మేమిటో ముందే ఊహించాను. నే నెలా భయపడ్డానో అక్షరాలా అలాగే జరిగింది వాళ్లు అడిగినప్పుడు 'ఇవ్వను పొమ్మన్నాడు' నాన్న.

అమ్మకు నేనంటే పంచప్రాణాలు. పోనీ అమ్మకు చెప్పి చూద్దామని, ఆవిడతో అంతా చెప్పాను.

"అమ్మా! డబ్బులేకుంటేనేం! మనకుందిగా, పోనీ డబ్బువిషయం అలా ఉంచండి. ఇద్దరం కష్టపడితే మా జీవితాలు సాఫీగా గడవకపోవు ముఖ్యంగా, నేనా అబ్బాయికి మాట యిచ్చాను. దానికి వ్యతిరేకంగా నేను నడవలేను. ఆడపిల్లని, సిగ్గువిడిచి తల్లివి కాబట్టి నిన్ను అర్థిస్తున్నాను. మీ చేతులతో ఏదో స్వల్పంలో ఆ కార్యం కాస్తా అయిందనిపించండి" అన్నాను డగ్గుత్తికతో అమ్మ చలించి, 'అలాగే తల్లీ, నాన్నగారికి చెప్పిచూస్తాను' అని లేచింది

ఆ రాత్రి అమ్మ నాన్నతో మాట్లాడుతూంటే చాటుగా విన్నాను. నాన్న 'ససేమిరా వల్లకాదంటు'న్నాడు ఇంకేంచెయ్యను! ఏదో తెగించాల్సిఉంది, అని నిర్ధారణ చేసుకున్నాను.

కృష్ణమూర్తి ఈ సంఘటన తర్వాత చాల నిరుత్సాహంగా ఉత్తరాలు వ్రాసేవాడు. అట్టే ఆలస్యంచేస్తే పిచ్చివాడైపోతాడేమోనని నాకు భయం వేసింది. మేమిద్దరం కొన్ని రోజుల తర్వాత ఓ ఆలోచనకి వచ్చాం ఆ విధంగా చెయ్యాలని అనుకున్నాం

నేను మా నాన్నతో 'రాజమండ్రిలో ఒక స్నేహితురాలు జబ్బుగా ఉందిట, వెళ్తా'నని చెప్పి బయలుదేరి రాజమండ్రి వచ్చాను. అక్కడ కృష్ణమూర్తి హాజర్‌గా ఉన్నాడు. మేమిద్దరం కలసి విజయవాడవచ్చి ఇక్కడ రిజిస్టర్ మేరేజి చేసుకున్నాం కొన్నాళ్ళు కష్టపడ్డామనుకో. తర్వాత ఆయనకు ఒక గుమస్తా ఉద్యోగం దొరికింది అలా మా కొత్తసంసారం ఆరంభమయింది.

నేను విజయవాడనుండి అమ్మ వాళ్ళకొక ఉత్తరం వ్రాశానిలా—

పూజ్యులైన అమ్మకు, నాన్నగార్కి....

మీ కుమార్తె నమస్కారములతో వ్రాయుట. ఈ ఉత్తరం మీకెంత కష్టం కల్గిస్తుందో నాకు తెలును కాని వ్రాయక తప్పదు. నేనూ కృష్ణ మూర్తి ఇక్కడ రిజిస్టర్‌వివాహం చేసుకున్నాం. ఆయనకు ఒక చిన్న ఉద్యోగంకూడా అయింది. నేను నాపెండ్లి మీ చేతులతో చేయమని ఎంతో ప్రార్థించాను. కాని మీరు నిరాకరించారు ఇంక నాకు వేరే గత్యంతర మేముంది? కృష్ణ మూర్తికి మాటయిచ్చాను, హృదయమిచ్చాను. అదికాదని నేను మరొకతన్ని పెండ్లాడితే ఎంత మంది జీవితాలు నాశనం అవుతాయో ఊహిం చారా? అందుకని మీ ఆజ్ఞ జవదాటి ఇలా వచ్చినందుకు క్షమించండి. తల్లిదండ్రులైన మీరు క్షమించకపోతే నన్నింకెవరు క్షమిస్తారు!

ఇట్లు కుమార్తె అరుణ.

నా ఉత్తరానికి జవాబురాలేదు. సరికదా, నాన్న చిందులు త్రొక్కాడని మా ఊరునుండి వచ్చిన ఒకాయన చెప్పాడు తనకు కూతురే లేదు పొమ్మన్నాట్ట నాకు యిప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. నన్ను అంత గారాబంగా, ప్రేమగా చూచింది మా నాన్నేనా అని,'' అని ఆగి,

''అబ్బ! చాల పొద్దుపోయింది తక్కింది రేపు చెపుతాలే. పడుకోరామం!'' అంది అరుణ.

''నీ కథ నాకు చూచాయగా తెలును. ఇలా విశదంగా తెలుసుకుందుకు ఇంతకన్న మంచి అవకాశం ఉండదు. ఫర్వాలేదు చెప్ప అరుణా!'' అని రామలక్ష్మి బలవంతంచేయగా మళ్ళా అరుణ తన గాథ సాగించింది.

* * *

''మా జీవితాలు ఎంతో ఆనందదాయకంగా గడిచిపోసాగాయి. పెండ్లి అయిన రెండో సంవ త్సరానికల్లా బేబీ పుట్టడం, ఆయన తాసిల్దార్ అవటం జరిగింది. నాకు తల్లిదండ్రు లుండి కూడా లేనిదానిలా ఉన్నాననే విచారం తప్ప నా సంసారం అంతా సంతోషమయంగా ఉండేది. ఆ మరుసటి సంవత్సరం ఆఖర్లో గోపీ పుట్టాడు. నాకు వాళ్ళిద్దర్నీ తీసికెళ్ళి అమ్మకు చూపుదామనుంటుంది. మా సంగ తులు వాళ్ళకి ఎప్పటికప్పుడు చూచిన వాళ్లు చెబుతూనే ఉన్నారు. అమ్మ ఎన్నోసార్లు ప్రయాణమైందట కాని నాన్న మాట పట్టింపు మనిషి కావటం మూలాన్న వీల్లేదని అమ్మను రానీయటంలేదు.''

''నువ్వేం తక్కువ తిన్నావా? ఆ తండ్రికి తగ్గ కూతురువేగా!'' అంది రామలక్ష్మి.

''ఆఁ! అలాగంటావా! అవును. అదీ నిజమే. అందువల్లే నా బ్రతుకిలా కాలింది'' అంది అరుణ.

''మధ్యలో డిస్టర్బ్ చేసాను, కానీయ్!'' అంది రామలక్ష్మి.

ప్రారంభించింది అరుణ.

''ఆరునెలలక్రితం ఒకసంఘటన జరిగింది. ''ఏమండీ! సినిమాకి తీసికెళ్లమని బేబీ గొడవ చేస్తూంది మేటనీకి వెళ్దామా?'' అన్నాను ఆ రోజు ఆయనతో.

''అరె! నాకీవేళ చాలా అర్జంటు పనులు న్నాయి ఆఫీసులో; నేను రావటానికి వీలుం డదు గాని, నీవు పిల్లల్ని తీసికెళ్లు'' అని, బేబీతో—''బేబీ! అమ్మ, నీవు, తమ్ముడు సినిమాకు వెళ్ళిరండమ్మా!'' అంటూ మమ్మల్ని సాగనంపారు

ఆ రోజు సినిమాహాల్లుచాలా రష్‌గా ఉంది. దానికితోడు గాలిలేదు. ఇంటర్వెల్ అయిం తర్వాత గోపీ ఒకటే గొడవచేయటం మొదలు పెట్టాడు 'ఇంటికి వెళ్దాం' అంటూ. ఎంత సముదాయించినా ఊరుకోక ఆరునొక్కరాగం మొదలు పెట్టాడు. ఇంక తప్పదని, బేబీని వాళ్ల నాన్నగారితో మళ్లా సినిమాకు పంపిస్తానని ఒప్పించి, బయటకు తీసికొచ్చాను. అప్పటికి సాయింత్రం నాలుగున్నర అయి ఉంటుంది రిక్షా చేయించుకు ఇల్లు చేరుకున్నాం

తలుపులు లోన గడియవేసి ఉన్నాయి. తలుపు తట్టబోయేసరికి లోన ఎవరిదో ఆడ గొంతు, గాజుల గలలు, తర్వాత మావారి గొంతుక వినిపించాయి. నేను స్థంభించిం పోయాను. కాళ్లు వణకటం ప్రారంభించాయి. ఇప్పుడు తలుపులు తట్టి వాళ్లని వీధిలోపెడితే, ఇంటి గుట్టు రచ్చకెక్కించినట్టు కదూ! అందు కని చైతన్యరహితంగా ఆ గుమ్మంలో అలానే

చతికిల పడ్డాను. బేబీ 'తలుపు తట్టమ్మా' అంటుంటే—'వద్దు తల్లీ, నీవుపోయి ఆడుకో' అని పంపేశాను గోపీ కాస్సేపటికి నా వళ్ళో పండుకొని నిద్రపోయాడు.

నా కాక్షణం ఎన్నో పిచ్చిపిచ్చి ఆలోచనలు వచ్చాయి. ఆత్మహత్య చేసుకొందా మనుకున్నాను. కాని నా పిల్లలు—అమ్మో! తల్లిలేని వాళ్ళై, సవితి తల్లి సంరక్షణక్రింద వాళ్ళు పెరగాలా? వద్దు! నేను ఈ పిల్లల కొరకైనా బ్రతుకుతాను....అబ్బ! ఈయన ఎంత నీచానికి ఒడిగట్టాడు! పేరు సార్థకం చేసుకున్నాడు. అయినా ఇద్దరి బిడ్డల తండ్రికదా, ఏమిటీ వైపరీత్యం! నా బ్రతుకేమిటిలా అయింది? నాకష్టం వినేవాళ్ళెవరున్నారు? ఎవరితో చెప్పినా, "నీ చేతులతో నీవు చేసుకున్నావ్! అనుభవించు" అని నన్నే అంటారు. అవును, నిజమే! ఆ నాడు నాదగ్గిర కల్లిబొల్లి ఏడ్పులు ఏడ్చి నాచేత సరే ననిపించుకొన్నాడు ఇచ్చిన మాట తీసివేయలేక, మన్నితం అనుకున్న అతని హృదయం నొప్పించలేక, నా సర్వస్వం అయిన తల్లి దండ్రులని, మానమర్యాదలని విడచి ఈయన్ని పెండ్లాడాను. నన్ను దిక్కులేని దాన్నిచేసి నన్నే మోసం చేయచూస్తాడా! అబ్బ! మొగవాళ్ళు ఎంతకైనా తగుదురు! నాదగ్గిర ఎలా కన్నీళ్లు పెట్టుకు ఒప్పించాడో, ఈ పిల్లనికూడా అలాగే ఒప్పించి ఉంటాడు. ఇతనిలో ఇంత కృత్రిమం ఉందని తెలిసిఉంటేనా—అయ్యో! చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకు ఏం లాభం?....

అప్పటి నాస్థితి స్త్రీవయిన నీవు బాగా అర్థం చేసుకోగల వనుకుంటాను. నా గుండెల్లో మంటలు రాజుకున్నాయ్. ఇంక ఆ అగ్ని పర్వతం ప్రేలుతుందేమో అనేసరికి .తలుపులు తెరువబడ్డాయి. ఇద్దరూ బయటకు రాబోయి తక్కున గుమ్మందగ్గిర ఆగిపోయారు. ఇంట్లోని లైటుకాంతి నా ముఖంమీద పడుతోంది. ఆ కాంతిలో నా ముఖం చూచేసరికి వాళ్ళ ప్రైప్రాణాలు పైనే పోయుంటాయి. నేను క్షణం తీక్షణంగా వాళ్ళిద్దరివేపు చూచి, నిద్రపోతున్న గోపీని భుజంమీదవేసుకుఇంట్లోకివెళ్ళిపోయాను.

ఆ రాత్రి పిల్లలకు భోజనంపెట్టి, నేను పడుకున్నాను. నాకు జరిగిన ఈ అన్యాయానికి చేతులు కట్టుకు కూర్చోలేను. ఆలోచించి, ఒక తీర్మానానికి వచ్చాను అది నా సుఖానికే ఆటంకం అవవచ్చు. కాని నాకు సుఖమనేది ఉంటేకదూ! అంతా గంగలో కలిసింది. ఇలా ఆలోచించుకుంటూ నిద్రపోయాను. కృష్ణమూర్తి ఏవేళ ఇల్లు చేరాడో నాకు తెలియదు.

నేను ఆ రోజునుండి ఒక్కమాట ఆయనతో మాట్లాడలేదు నాతో ఏదో చెబుదామన్నట్లు ప్రయత్నించేవాడు. కాని నేను అలాంటి అవకాశం ఇవ్వలేదు అసలు నా ముఖంలోకి సూటిగా చూడడానికి ఆయనకు ధైర్యం ఏది? ఆయన యీ సంఘటన జరిగిన తర్వాత మనిషి మారినట్లు కనబడ్డాడు. పూర్వం ఆఫీసు లేని వేళల్లో తిరగటానికి వెళ్లేవారు ఇప్పుడలా కాకుండా పిల్లలతో ఆడుకుంటూ కూర్చునేవారు. పిల్లలకి తండ్రన్నా, తండ్రికి పిల్లలన్నా అమితమైన ప్రేమ!

ఆ రోజు నుండి నేను స్వయంగా ఉద్యోగాన్వేషణ ప్రారంభించాను ఇక్కడ దగ్గిర్లోనే ఉన్న ఒక ఆడపిల్లల స్కూలుకు వెళ్ళి ఆ హెడ్ మిస్ట్రెస్‌తో మాట్లాడాను ఆవిడ ట్రైయినింగ్ లేకుండా వేసుకోనంది కాని, కావాలంటే ఒక క్లార్కు పోస్టు వాళ్ల ఆఫీసులో ఇస్తానంది. సరేనని ఒప్పుకున్నాను.

ఆ మర్నాటి నుండి వెళ్ళి ఉద్యోగంలో చేరాను.

ఆయన అటు ఆఫీసుకు వెళ్ళగానే, నేను పిల్లల్ని తీసుకు బడికి వెళ్ళేదాన్ని రెండు రోజులయిం తర్వాత ఆయన "అరుణా! నీవు ఉద్యో...." అంటుంటే పూర్తిగా వినకుండానే నేను అక్కడనుండి వచ్చేశాను.

ఇలా ఒక నాలుగు మాసాలు మాటామంతీ లేకుండా, ఎవరి హృదయాల్లోని వ్యథ వాళ్లు దాచుకుంటూ గడిపాం.

ఆ రోజు ఆదివారం. నాకు ఆఫీసు లేదు. ఇంట్లోనే కూర్చుని బేబీకి స్వెటర్ అల్లుతున్నాను.

"అరుణా!" ఆయన ఎప్పుడు వచ్చిందీ నేను చూడలేదు నేను లేచి వెళ్ళబోతుంటే నా చెయ్యి పట్టుకుని, "దయచేసి కూర్చో అరుణా! నీతో మాట్లాడాలి" అన్నారు.

"ఆ మాట్లాడే అవసరాలు ఏనాడో తీరి పోయాయ్!" అన్నాను, కళ్ళ నీళ్ళొత్తుకుంటూ.

"అలాక్కాదు, ఇటు చూడు నాకు ట్రాన్స్ ఫర్ ఆర్డర్లు వచ్చాయి మనమంతా వెళ్ళి పోదాం ఇంక వారం రోజులు గడువుంది" అంటుంటేనే, నేనక్కడ నిలువబుద్ధిపుట్టక వెళ్ళిపోయాను

ఆ వారం రోజులు శెలవమూలాన్న ఆయన ఇంట్లోనే ఉన్నారు నేను మాత్రం ఏ విధమైన ప్రయాణ సన్నాహాలలోను లేను. నా పనిలో నేనుండేదాన్ని ఇంక ఆయన వెళ్ళేందుకు రెండు రోజులే ఉన్నాయి. ఆ రోజు నాదగ్గిరకు వచ్చి, "అరుణా! ఏమిటిది? ఏమీ సర్దలేదేం? ఎల్లుండే మన ప్రయాణం" అన్నారు.

"నేను రావటంలేదు. మీరు వెళ్ళండి" అన్నాను.

"అదేమిటి? రాకపోవటం ఏమిటి?"

"మరేంలేదు నేను మీకు అనవసరం అని రూఢి అయింతర్వాత నాకుకూడా మీ అవసరం లేదు" అన్నాను కసిగా.

'అరుణా! నీ కెన్నోసార్లు చెబుదా మను కున్నాను క్షమించమని అడుగుదా మను కున్నాను. కాని వీలు చిక్కనివ్వలేదు నీవు ఆ రోజు మీరు సినీమాకి వెళ్ళిం తర్వాత నేనుకూడా ఆఫీసుకు బయలుదేరాను గుమ్మంలోకి వచ్చే సరికి ఆ లక్ష్మి వచ్చి 'అరుణక్కయ్యా!' అని పిలిచింది నేను సినిమాకెళ్ళావని చెప్పాను. కాని ఆమె వెళ్ళకుండా నవ్వుతూ 'మీతో మాట్లాడకూడదా నేను!' అంటూ లోనికి వచ్చింది అప్పుడు నేనేం చెయ్యగలను? వారంరోజులనుండి ఆమె ప్రవర్తన నాకు క్రొత్త గానే కనిపించింది నేను ఆఫీసుకు వెళ్తున్న ప్పుడు, వస్తున్నప్పుడు నావైపు చూడడం, నవ్వటం చేస్తుండేది... అరుణా! తప్పు చేశా నని ఒప్పుకుంటాను. కాని అది అనుకోకుండా జరిగింది. నీకు అన్యాయం చేద్దామని నా కెప్పుడూ లేదు. ఒక స్త్రీ, పురుషుని కవ్వించి లాలిస్తే ఎవరు నిగ్రహించుకోగలరు, చెప్పు? నేనూ మానవుణ్ణే కావటం మూలాన్న ఆ పరిస్థి తులకు లొంగి పతనం కావలసి వచ్చింది. దాని ఫలితం అనుభవిస్తున్నాను. అలాంటి సంఘ టన ఇకమీద జరగదు, అరుణా! నన్ను నమ్ము. నాకు ఇక ఈ ఊర్లో ఉండటం ఇష్టంలేకే ట్రాన్స్ఫర్ పెట్టించుకున్నాను నా మాట నమ్మవా?" అంటూ నా రెండు చేతులూ పట్టుకున్నారు.

స్త్రీలో గల సహజ మాతృత్వం నాలో ఆ క్షణం ఆయన ఎడల పొంగి పొర్లింది. వారిని దగ్గిరకు తీసుకొని లాలిద్దామనిపించింది కాని మళ్ళీ జరిగినదంతా గిర్రున నా కళ్ళముందు తిరిగేసరికి నా హృదయం పాషాణం అయింది.

"మిమ్మల్ని ఇదివరలో నమ్మే ఈ దశకు వచ్చాను. ఇక నమ్మవలసిందేమీ లేదు నా బ్రతుకు నేను బ్రతగ్గలను" అన్నాను.

"అరుణా! నన్ను క్షమించు. నేను అపచా రమే చేశాను. కాని ఇంత కఠినశిక్ష నేను భరించగలనా?" అన్నారు దీనంగా.

"క్షమించడానికి నేనెవర్ని? ఆ భగవంతుడే మిమ్మల్ని క్షమిస్తాడు అటువంటి శక్తి నాకు లేదు" అంటూ నేను వంట ఇంట్లో పనిచూసు కుందుకు వెళ్ళిపోయాను

ఉద్యోగ ధర్మం కాబట్టి ఆయనకు వెళ్లక తప్పలేదు వెళ్ళేటప్పుడు పిల్లల్ని దగ్గరకు తీసు కొని "బేబీ! అమ్మ చెప్పినట్లు నడుచుకోండి. బాగా చదువుకోండి. నాన్నను మరచిపోరు కదూ!" అంటూ విడవలేక విడచి వెళ్ళి పోయారు.

వెళ్ళిం తర్వాత ఒక మనియార్డరు వచ్చింది కాని, నేను త్రిప్పి పంపేశాను బేబీకి నామీద కంటే, వారిమీద ప్రేమ ఎక్కువ. ఆయనదగ్గిర చాల చేరిక నాలుగురోజులు కనబడకపోయే సరికి బెంగ పెట్టుకుంది దాంతో జ్వరం. ఆ జ్వరం క్రమేణా ఇలా విషమించింది. ఇదీ సంగతి" అని ముగించింది అరుణ.

"ఇంతకీ ఆయనకు బేబీ సంగతి తెలియ పర్చావా? లేదా?" అంది రామలక్ష్మి.

"లేదు ఆయన అడ్రస్ నాకు తెలియదు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలో ఎక్కడో బదలీ అయింది. నాకు సరిగా జ్ఞాపకం లేదు" అంది అరుణ

"అబ్బ! ఎంత మొండిదానివమ్మా, నీవు! ఆయన అంత బ్రతిమాలి క్షమించమంటేకూడా నీకా పట్టింపెందుకు? ఇలా నీవు చేసినందువల్ల కృష్ణమూర్తి నైతికంగా మరీ పతనం కావచ్చు దానికి నీవే బాధ్యురాలవవుతావు సుమా!" అంది తీక్షణంగా రామలక్ష్మి

"అదేమిటి రామం! నన్నంటున్నావ్! ఇంత త్యాగంచేసి ఆయనకు ఆనందం చేకూర్చాలని ప్రయత్నిస్తే ఆయన నాకు తిరిగి చేసిందేమిటి? మోసం! అన్యాయం! కాదనగలవా?" అంది అరుణ.

"అవుననుకో! కాని స్త్రీలో ఓర్పు, క్షమ ఎక్కువకదా! అవన్నీ నీవు ఒకమూలకు నెట్టావ్. అలాకాకుండా అవన్నీ బయటపెట్టి నీ సంసారం బాగుపర్చుకో! మనలో మాతృత్వం ఉందని నీవేకదా చెప్పావు. తల్లి, బిడ్డ ఎంత తప్పు చేసినా క్షమించకుండా ఉండగలదా? నీవుకూడా నీ మనస్సులో, నీ అంతర్యంలో ఆయన్ను క్షమించావ్! నాకు తెలుసు కాని మాట పట్టింపుమీద ఇలా మొండిగా కూర్చున్నావ్! నీ మొండితనంవల్ల నీ బిడ్డను నీకు కాకుండా చేసుకుంటావా?"

"ఆ! ఏమన్నావ్! అలా ఎన్నటికీకాదు. నా బేబీ బ్రతుకుతుంది తప్పక బ్రతుకుతుంది" అంది అరుణ కన్నీరు కారుస్తూ

"అలా అంటే కాదు. ఇది అసలే బెంగ జ్వరం. తండ్రిని తప్పక పిలిపించాలి. నేను దాని విషయమై చూస్తాను. తెల్లవారవస్తోంది. ఒక్క కునుకు తీద్దాం" అంటూ వత్తిగిలింది రామలక్ష్మి. అరుణకు నిద్రపట్టలేదు. స్నేహితురాలు అన్న మాటలే చెవులో రొద చేస్తున్నాయి. గబగబ బేబీ మంచం దగ్గిరకు వెళ్ళి, అక్కడ కుర్చీలో కూలబడింది

* * *

ఆ మర్నాడు కూడా బేబీ టెంపరేచర్ దిగలేదు. ఇద్దరికీ భయంగానే ఉంది. రామలక్ష్మి కృష్ణమూర్తి అడ్రస్ తాసిల్దార్ ఆఫీసులో కనుక్కు వచ్చి, అతనికి వెంటనే రమ్మని టెలిగ్రాం ఇచ్చింది. కృష్ణమూర్తి రెండోనాటికల్లా ఆదుర్దాగా బిడ్డదగ్గిరకు వచ్చి వాలాడు అరుణ ఏమీ మాట్లాడలేదు. రామలక్ష్మి అతనికి అన్ని సంగతులు చెపుతోంది. కృష్ణమూర్తి చాల మారిపోయాడనుకుంది అరుణ. చాల చిక్కిపోయాడు అతను ఏవిధంగా మారినా తానే కారకురాలవుతుందన్న మాటలు జ్ఞాపకం వచ్చే సరికి అరుణకు కళ్ళల్లో నీరు తిరిగాయి.

బేబీ మగతగా పడుకొని ఉంది. ఆ రోజు కూడా టెంపరేచర్ తగ్గలేదు కాని ఆ రాత్రి బేబీకి కాస్తతెలివి వచ్చింది.

"అమ్మా! నా.... న్న.... కా.... వా....లి" అంది నీరసంగా.

"తల్లీ! వచ్చానమ్మా! నాన్నను వచ్చాను, చూడమ్మా" అన్నాడు కృష్ణమూర్తి

"నా. న్నా! వ ..చ్చా...వా!" అంటూ మెడకు రెండుచేతులూ పెనవేసింది. బిడ్డ ఎముకల ప్రోగులా ఉంది ఆ స్థితిలో బేబీని చూచేసరికి అక్కడున్న ఆ ముగ్గురికీ కళ్ళు చెమ్మగిల్లాయి

కృష్ణమూర్తి బేబీని నెమ్మదిగా పడుకోబెట్టాడు. దగ్గరగా కూర్చున్నాడు బేబీ నీరసంగా ఉంది. ఏదో చెబుతూంది. దగ్గరగా వంగి వినటానికి ప్రయత్నించాడు కృష్ణమూర్తి.

"నాన్నా! అమ్మను....నన్ను .... తమ్ముణ్ణి వదలి....వెళ్ళవుకదూ! ఎప్పుడూ వెళ్ళవు.... కదూ!" అంది బేబీ ఏడుస్తూ.

"తల్లీ! వెళ్లనమ్మా, ఇక్కడే ఉంటాను ఎప్పుడూ మీదగ్గిరే ఉంటాను," కళ్ళలో నీరు కారుతూంటే ఎలాగో అనగల్గాడు కృష్ణమూర్తి.

ఆ రాత్రి ఏడ్చినందువల్లనైతేనేం, 'ఎగ్జైట్మెంటు' వల్లనైతేనేం, టెంపరేచరు మరో డిగ్రీ హెచ్చింది. రామలక్ష్మి, మరో డాక్టర్ అక్కడే కనిపెట్టుకుని కూర్చున్నారు. తల్లిచేతినీ, తండ్రి చేతినీ తన చేతిలో గట్టిగా పట్టుకొనే ఉంది బేబి

తెల్లవార వస్తూంది. బేబీ ఇంకా మగతలోనే ఉంది. రామలక్ష్మి ఎంతో ఆత్రంగా పల్స్ పట్టుకునే కూర్చుంది. ఇంతలో ఒక్కసారి బేబీ కండ్లుతెరచి అందరివంకా చూచి, చిరునవ్వుతో మళ్లీ కండ్లు మూసేసుకుంది. అంతే, మూసిన కండ్లు మళ్లా తెరువలేదు

అంతా బావురు మన్నారు

అరుణ భర్త పాదాలు పెనవేసుకొని, "నన్ను క్షమించండి. బేబీ మరణానికి కారకురాలిని నేను! తండ్రీ, బిడ్డను వేరుచేశాను నన్నేంచేస్తే పాపం ఉంటుందీ? అయ్యో!" అంటూ ఒకటే ఏడుపు

ఆ స్థితిలో కృష్ణమూర్తిని ఎవరైనా చూస్తే పోల్చుకోలేరేమో! పిచ్చివాడిలా అయిపోయాడు.

"అరుణా! ఇందులో నీ ప్రమేయమేం లేదు నా పాపానికి నాచిట్టితల్లి బలిఅయింది!" అంటూ అరుణని కౌగిలించుకొని గట్టిగా ఏడ్చాడు.

ఆ దృశ్యం చూస్తున్న రామలక్ష్మి గుడ్లనీరు క్రక్కడం తప్ప మరేం చేయలేక పోయింది. వాళ్ళిద్దర్ని ఓదార్చే శక్తి తనకు లేదనుకుంది.

కాని, ఓదార్పు లేనిదే మనుషులు జీవించగలరా? ఆ పరిస్థితిలో కృష్ణమూర్తికి అరుణలో ఓదార్పు, అరుణకు కృష్ణమూర్తిలో ఓదార్పు కనిపించాయి ఇద్దరూ ఒకర్నొకరు ఓదార్చుకోవడం అవసరమైంది.

బేబీ చిన్నబిడ్డ అయినా, ఆ కుటుంబాన్ని మరల కలిపి తాను వెళ్ళిపోయింది. ఆ రోజు నుండి కృష్ణమూర్తి అరుణను విడచి క్షణం ఉండలేదు

(సమాప్తము) ★


# ది ఇండియన్ బ్యాంకు లిమిటెడ్

( స్థాపితం  1907 )

హెడ్ ఆఫీసు మద్రాసు-1.

దక్షిణ భారతం అంతటనూ, బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీ, కొలంబో, సింగపూర్, ఎఫ్ ఎమ్ ఎస్., మఱియూ 16 స్థానిక ఆఫీసులు

మూలధనము

| | | | |
|---|---|---|---|
| అనుమతి పొందిన | ... | రు. | 1,00,00,000 |
| చందా వేయబడిన | ... | రు. | 72,00,000 |
| చెల్లించబడిన | ... | రు | 62,02,615 |
| రిజర్వులు & ఇతర నిధులు | ... | రు | 79,75,000 |
| డిపాజిట్లు (30-6-56) | ... | రు. | 32.08 కోట్లు |

ఫారెన్ ఎక్స్చేంజితో సహా అన్నిరకముల బ్యాంకింగ్ వ్యాపారము జరుపబడును.

**డి. పి. పార్థసారథి,** బి ఏ. (ఆనర్సు) బి ఎల్., సెక్రటరీ.